# పేదలకు వరంలా డబుల్ బెడ్‌రూం పథకం

- నలగండ్లలో డబుల్ బెడ్‌రూం ఇండ్లు పంపిణీ చేసిన డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్
- పాల్గొన్న ప్రభుత్వ విప్ అరెకపూడి గాంధీ



డబుల్ బెడ్‌రూం ఇండ్లను ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్, విప్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

కొండాపూర్, అక్టోబర్ 2 : ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశ పెట్టిన డబుల్ బెడ్‌రూం పథకం పేదలకు వరంలా మారిందని తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ అన్నారు. సోమవారం శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇండ్ల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే అరెకపూడి గాంధీతో కలిసి లబ్ధిదారులకు అందజేశారు. హఫీజ్‌పేట్‌లో 128, నలగండ్లలో 216మంది పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ స్పీకర్ మాట్లాడుతూ.. పేద, మధ్య తరగతి ప్రజలు ఇరుకు గదుల నుంచి విశాలమైన డబుల్ బెడ్రూం ఇండ్లకు ముఖ్యమంత్రి కేసీఆర్ కృషి వల్లనే సాధ్యమవుతుందన్నారు. గత ప్రభుత్వాల హయాంలో నిర్మించిన ఇండ్లలో పండకు అల్లుడొస్తే అత్తమామలు బయట పడుకునే పరిస్థితులున్నాయన్నారు. పైసా ఖర్చు లేకుండా ప్రతి పేదోడికి డబుల్ బెడ్రూం ఇంటిని అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. డబుల్ బెడ్రూంలు పొందిన ప్రతి ఒక్కరు ఇండ్లను అమ్ముకునే పనులు మాత్రం చేయవద్దని సూచించారు. అనంతరం ప్రభుత్వ విప్ అరెకపూడి గాంధీ మాట్లాడుతూ.. పేద, మధ్య తరగతి ప్రజలకు ముఖ్యమంత్రి కేసీఆర్ వరంలా డబుల్ బెడ్‌రూం ఇండ్లను తీసుకొచ్చారన్నారు. నియోజకవర్గంలో ఇప్పటికే 2819 బెడ్‌రూంలు లబ్ధిదారులకు అందించగా, వీరిలో వికలాంగులు 70 మంది, ఎస్సీలు 479 మంది, ఎస్టీలు 169 మంది, జనరల్ కేటగిరీలో 2101 మంది ఎంపికయ్యారు. ఇండ్ల ఎంపిక ప్రక్రియ పూర్తి పారదర్శకంగా కేంద్ర ప్రభుత్వ సాఫ్ట్‌వేర్ ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేసినట్లు తెలిపారు. డబుల్ బెడ్‌రూంల నిర్మాణాల్లో లిఫ్టలు, జనరేటర్లు, పార్కింగ్‌లు ఏర్పాటు చేయగా, మెయింటెనెన్స్ సైతం లబ్ధిదారుల నుంచి కాకుండా ప్రత్యమ్నాయ ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. అబద్దపు హామీలతో కొంతమంది మోసగాళ్లు ఓట్ల కోసం మీ ముందుకు వస్తున్నారని, అలాంటి వాళ్లను నమ్మొద్దన్నారు. ఆడ బిడ్డ పెండ్లికి, ఇంటి నిర్మాణానికి ఆర్థికంగా సహకరిస్తున్న ఏకైక ప్రభుత్వం తెలంగాణే అన్నారు. ఇప్పటి వరకు వివిధ రంగాలలో కేంద్ర ప్రభుత్వం నుంచి అత్యధిక అవార్డులు పొందిన రాష్ట్రంగా తెలంగాణ ప్రథమ స్థానంలో ఉందన్నారు. అనంతరం డిప్యూటీ స్పీకర్ పద్మారావుతో కలిసి బటన్ నొక్కి లబ్ధిదారులకు నల్లగండ్ల, హఫీజ్‌పేట్‌లో నిర్మించిన అపార్ట్‌మెంట్లలోని ఇండ్లను కేటాయించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు గంగాధర్‌రెడ్డి, పూజితగౌడ్, మంజులరెడ్డి, జగదీశ్వర్‌గౌడ్, రోజాదేవి, శ్రీనివాస్‌రావు, మాజీ కార్పొరేటర్ సాయిబాబా, జెడ్సీ శ్రీనివాస్‌రెడ్డి, డీసీ రజనీకాంత్‌రెడ్డి, రెవెన్యూ, జీహెచ్‌ఎంసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మహాత్మా గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్, విప్ గాంధీ, కార్పొరేటర్లు

### మాటల్లో చెప్పలేనంత సంతోషంగా ఉంది



ముగ్గురు ఆడపిల్లలతో అద్దె ఇంట్లో ఉంటూ అనేక కష్టాలు పడుతున్నాము. సమయానికి అద్దె చెల్లించలేక, పిల్లల చదువులు, ఇతర ఖర్చులకు చాలా ఇబ్బందులు పడుతున్నాము. అలాంటి పరిస్థితుల్లో సీఎం కేసీఆర్ సార్ దేవుడిలా సొంతింటిని ఇచ్చాడు. ఈ సంతోషం మాటల్లో చెప్పలేను. మా జీవితాలకు కేసీఆర్ సార్ దేవుడు, ఆయన రుణం తీర్చుకోలేనిది.

– కోట నాగేంద్ర, లింగంపల్లి

### పైసా ఖర్చు లేకుండా సొంతిళ్లు



ఎన్నో ఏండ్లుగా కిరాయి ఇండ్లలో ఉంటూ ఇబ్బందులు పడుతూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నా. ముఖ్యమంత్రి కేసీఆర్ పేదలకు వరంలా తీసుకువచ్చిన డబుల్ బెడ్‌రూం ఇంటికి దరఖాస్తు పెట్టుకున్న నాటి నుంచి ఇంటిని పొందే వరకు పైసా ఖర్చు లేకుండా ముందుకుసాగినా. ఏ ఒక్కరికి రూపాయి ఇవ్వకుండానే డబుల్ బెడ్‌రూం లబ్ధిదారురాలిగా ఎంపికయ్యాను. జీవితాంతం కేసీఆర్ సార్‌కు రుణపడి ఉంటాను. డబుల్ బెడ్‌రూం రాదేమోనన్న భయంలో ఉన్న మాకు ఎమ్మెల్యే సార్ ఎంతో ధైర్యాన్నిచ్చారు.

– సౌజన్య పాపిరెడ్డి కాలనీ, శేరిలింగంపల్లి

## చిత్తశుద్ధితో ముందుకు సాగుతున్నాం

**వినాయక్‌నగర్‌లో సీసీ రోడ్లను ప్రారంభించిన విప్ గాంధీ**



సమావేశంలో మాట్లాడుతున్న విప్ గాంధీ

కొండాపూర్, అక్టోబర్ 2 : ప్రజల సంక్షేమం, అభివృద్ధిలకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందని ప్రభుత్వ విప్, శేరిలింగంపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. సోమవారం గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని వినాయక నగర్‌లో రూ. 105 లక్షలతో పూర్తి చేసిన సీసీ రోడ్లను ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాజీ కార్పొరేటర్ సాయిబాబాతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు విప్ గాంధీ, సాయిబాబాలను పుష్పగుచ్ఛాలు అందజేసి సన్మానించారు. అనంతరం విప్ గాంధీ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం, అభివృద్ధిలకు చిత్తశుద్ధితో పని చేస్తుందన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటూ ముందుకు సాగుతుందన్నారు. అనంతరం కాలనీ వాసులతో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో నాయకులు గణేశ్ ముదిరాజ్, శ్రీనివాస్ యాదవ్, చెన్నం రాజు, వినోద్, మల్లేశ్, రమేశ్‌గౌడ్, రాజు ముదిరాజ్, నారాయణ, అమర్‌నాథ్, కర్ణాకర్, మహేందర్, నాగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## అలరించిన గాత్ర, నృత్య ప్రదర్శనలు



సాంస్కృతిక ప్రదర్శనలిస్తున్న కళాకారులు

కొండాపూర్, అక్టోబర్ 2 : మాదాపూర్‌లోని శిల్పారామంలో కొనసాగుతున్న గుజరాత్ ఉత్సవ్ మేళలో భాగంగా సోమవారం పలువురి కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలు సందర్శకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ప్రదర్శనల్లో శిరీష దేవులపల్లి తన శిష్య బృందంతో కలిసి దేశభక్తి గీతాలు, మహాత్మా గాంధీపై గీతాలను ఆలపించగా, కూచిపూడి నాట్య గురువులు లక్ష్మి శంకర్ తన శిష్య బృందంతో కలిసి ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు ఆధ్యాంతం ఆకట్టుకున్నాయి. గుజరాత్‌కు చెందిన చేనేత హస్తకళాకారులు ప్రదర్శనలో ఉంచిన ఉత్పత్తులను కొనుగోలు చేసేందుకు ఆసక్తి కనబరుస్తున్నారని, నగరవాసుల నుంచి మేళాకు విశేష స్పందన లభిస్తుందని నిర్వాహకులు తెలిపారు.



కళాకారుల నృత్య ప్రదర్శన

## ఘనంగా మహాత్మాగాంధీ జయంతి



మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పిస్తున్న బెటాలియన్ అధికారులు, సిబ్బంది

కొండాపూర్, అక్టోబర్ 2 : కొండాపూర్‌లోని 8వ పోలీసు బెటాలియన్‌లో సోమవారం జాతి పిత మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రీల జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. బెటాలియన్ కమాండెంట్ సీ సన్నీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అదనపు కమాండెంట్ కే సుబ్రహ్మణ్యం చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. స్వాతంత్ర్య పోరాటంలో శాంతి మార్గాన్ని ఎంచుకుని దేశ వ్యాప్తంగా ఎంతో మందికి మార్గదర్శకుడిగా గాంధీజీ నిలిచాడన్నారు. దేశ ప్రధాని హోదాలో లాల్ బహదూర్ శాస్త్రి నిరాడంబర జీవితాన్ని గడిపారన్నారు. ఆయన చేసిన జై జవాన్ జై కిసాన్ అనే నినాదంతో భారత్ – పాకిస్థాన్ యుద్ధ సమయంలో ముందుకు సాగారన్నారు. ఈ కార్యక్రమంలో బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్స్ దేవిదాస్ రాథోడ్, వీ నరసింహ స్వామి, ఎం రహమాన్, డీ నారాయణదాస్, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, సిబ్బంది పాల్గొని నివాళులర్పించారు.



జాతిపిత మహాత్మాగాంధీ జయంతిని శేరిలింగంపల్లి నియోజకవర్గ వ్యాప్తంగా సోమవారం నిర్వహించారు. బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండి రమేశ్ మియాపూర్‌లోని తన కార్యాలయంలో జాతిపిత చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు.

– మియాపూర్, అక్టోబర్ 2



మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని సోమవారం కొండాపూర్ డివిజన్ కార్పొరేటర్ హమీద్ పటేల్ తన కార్యాలయంలో గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

– కొండాపూర్, అక్టోబర్ 2



జాతిపిత మహాత్మా గాంధీ 154వ జయంతిని పురస్కరించుకొని సోమవారం కొండాపూర్‌లోని సీఆర్ ఫౌండేషన్‌లో సోమవారం మహాత్మ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన ఫౌండేషన్ అధ్యక్షుడు కె. నారాయణ, ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి, మాజీ శాసన సభ్యులు పల్లా వెంకట్‌రెడ్డి తదితరులు

– మాదాపూర్, అక్టోబర్ 2




జాతిపిత మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకొని సోమవారం మాదాపూర్‌లోని స్వాతి హై స్కూల్‌లో ప్రాంగణంలో మహాత్మ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ తదితరులు

– మాదాపూర్, అక్టోబర్ 2